సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



బాత్రూమ్‌లో జారిపడి..

బాత్‌రూమ్‌లో జారిపడి ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. - IIలో



ఆంక్షల యూరియా!

కూటమి ప్రభుత్వం అన్నదాతలను ముప్పతిప్పలు పెడుతోంది. యూరియాపై ఆంక్షలు విధించింది. - IIలో



కొనసా..గుతున్న స్వచ్ఛీకరణ!

జిల్లా వ్యాప్తంగా ఓటర్ల సవరణ స్వచ్ఛీకరణ సా..గుతోంది. ఇప్పటివరకు 40 శాతం మాత్రమే పూర్తి చేశారు. - IIలో

న్యూస్‌రీల్

13న నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 13న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న ప్రముఖ కంపెనీలలో ఉన్న అప్రెంటిస్‌షిప్ ఖాళీలను భర్తీ చేసేందుకు పీఎం నేషనల్ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేళా చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో శిక్షణ పూర్తిచేసి పాస్ అయినే విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. హాజరయ్యే వారు అప్రెంటిస్‌షిప్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో తమ కార్యాలయంలో సర్టిఫికెట్లతో సంప్రదించాలన్నారు.

నామినల్ రోల్స్ అందజేయండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ పరీక్షల నామినల్ రోల్స్ అందజేయాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఫీజు చలానాలను ఈ నెల 16వ తేదీలోపు ఆయా హెచ్‌ఎంలు డీఈవో కార్యాలయంలో అందజేయాలని డీఈవో ఆదేశించారు.

గజ ప్రజా యాప్‌పై విస్తృత అవగాహన



మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : గజ ప్రజా యాప్ పై విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఆర్‌వో మోహన్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ నూతనంగా ఆవిష్కరించిన గజ ప్రజా యాప్ ఉపయోగాలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో తెలియజేయాలన్నారు. వ్యవసాయ పంటల నష్టాలను నివేదించేందుకు యాప్ సహాయం చేస్తుందన్నారు. రైతులు ఈ యాప్‌ను వినియోగించి పంటల నష్టాల వివరాలను ఫొటోలతో సహా నేరుగా ఫోన్ నుంచి అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ఈ ప్రక్రియ పంట నష్ట పరిహారం ప్రక్రియను వేగవంతం చేస్తుందన్నారు. యాప్‌లో పంట నష్టం వివరాలను నమోదు చేస్తే వారంలోపు నష్టపరిహారం అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఏనుగుల వల్ల నష్టపోయిన పంటల వివరాలను గజ ప్రజా యాప్‌లో తెలుసుకోవచ్చన్నారు. త్వరలో ఈ యాప్ ను ప్రముఖుల చేతుల మీదు గా ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వైల్డ్ లైఫ్ నిష్టాతులు రాకేష్, ఆర్‌డీవో భవాని, సబ్ డివిజనల్ అటవీ శాఖ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తుల వేచి ఉన్న క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 74,861 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,802 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

ప్రపంచ దృష్టి లోపం దినోత్సవ ర్యాలీ



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ప్రపంచ దృష్టిలోప దినోత్సవం నిర్వహించారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి, కంటి వైద్యులు అర్పిత వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం డీఐసీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దృష్టి లోపం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు వివరించారు.

ప్రాణాలు తీస్తున్న.. నారాసుర పానం!

‘కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కల్తీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో స్పిరిట్‌ను అడ్డదారిలో ఆంధ్రాలోకి రప్పించుకున్నారు. విచ్చలవిడిగా కల్తీ మద్యం తయారు చేసి రాష్ట్రం మొత్తం సరఫరా చేశారు. వందల మంది ప్రాణాలతో చెలగాటమాడారు. కొన్ని వందల కుటుంబాలను రోడ్డున పడేశారు. అనేక మంది ఆరోగ్యాల మీద దెబ్బకొట్టారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు..?. వారి కుటుంబాలను ఎవరు ఆదుకుంటారు..?. వారికి అండగా ఎవరు నిలుస్తారు..? సీఎం చంద్రబాబునాయుడా..?!.. లోకేశా.. పవన్‌కళ్యాణా..?. సమాధానం చెప్పాలి..’ అంటూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు. కల్తీ మద్యం పెద్దలను వెంటనే అరెస్ట్ చేయాలంటూ చిత్తూరు జిల్లా కేంద్రంలో నిరసనలు మిన్నంటించారు.

చిత్తూరులో ఎక్సైజ్ స్టేషన్ వద్ద మద్యం బాటిళ్లను పగులగొట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు





ఏరులై పారుతున్న కల్తీ మద్యం

- అమాయకులు బలి
- దీనికి చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలి
- కల్తీమద్యం పెద్దలను అరెస్ట్ చేయాలి
- చిత్తూరులో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసన
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద మద్యం బాటిళ్ల ధ్వంసం

చిత్తూరు అర్బన్: ‘నారా’వారి కల్తీ మద్యానికి అమాయకులు బలవుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మొలకలచెరువు నుంచి కల్తీ మద్యం ఏపీ మొత్తానికి సరఫరా అయ్యింది. ఆఫ్రికాలో ప్రణాళికలు రూపొందించి, పేదల ప్రాణాలను తీశారు. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారు..?’ అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. కల్తీ మద్యం కేసులో పెద్దలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం చిత్తూరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. హై రోడ్డు నుంచి స్థానిక అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఎదుట మద్యం బాటిళ్లను పగులగొట్టి నిరసన తెలిపారు. అనంతరం మహిళా విభాగం నాయకులు మాట్లాడుతూ మొలకలచెరువులో వెలుగుచూసిన కల్తీమద్యం తయారీ, కూటమి ప్రభుత్వ నేతృత్వంలో రాష్ట్రం మొత్తానికి పాకిందన్నారు.

ఈ మౌనం దేనికి సంకేతం?

బడా‘బాబు’లను అరెస్ట్ చేయాలి!

కూటమి పార్టీకి చెందిన బడా నాయకుల పేర్లు బయటకురాకుండా ప్రభుత్వం కల్తీ మద్యం కేసును నీరుగార్చేందుకు చూస్తోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఆరోపించారు. నారా వారి నకిలీ మద్యం కేసులో దోషులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కల్తీమద్యం తాగి మృతి చెందిన బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. నకిలీ మద్యంలో వచ్చిన రూ.కోట్లను కూటమి నేతలంతా పంచుకున్నారని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని బెల్టు దుకాణాలకు, పలు మద్యం దుకాణాలకు నకిలీ మద్యం సరఫరా అయ్యిందని, వీటిని కుటీర పరిశ్రమలుగా నడుపుతున్నారని ఆరోపించారు.

‘వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు మద్యం బ్రాండ్లలో కుట్ర జరిగిపోయిందని మసిపూసి మారేడు కాయ చేశారు. తమ నాయకులే లక్ష్యంగా తప్పుడు కేసులు పెట్టి, జైలుకు పంపించారు. ఏదో జరిగిపోయిందంటూ గ్లోబెల్స్ ప్రచారానికి దిగారు. ఇప్పుడు నకిలీ మద్యంలో కూటమి నేతలు అడ్డంగా దొరికిపోయినా మౌనంగా ఉన్నారు. ఇది దేనికి సంకేతం...?’ అంటూ మహిళా నేతలు నిలదీశారు.

సరి‘హద్దు’లు దాటిన కల్తీ మద్యం

జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు దాటుకుని స్పిరిట్ చిత్తూరులోకి వస్తున్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని మహిళా నేతలు ఆరోపించారు. ఏడాదికిపైగా కల్తీ మద్యం జోరుగా సాగుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. అనంతరం ఎక్సైజ్ పోలీసులకు వినతి పత్రం అందచేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శులు పీవీ.గాయత్రీదేవి, లీనారెడ్డి, మునిసిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలి రెడ్డి, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు హరీషారెడ్డి, కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి, కౌసర్, పూంగొడి, బిందు, శాంతి, లత, విజయశాంతి, సృజన పాల్గొన్నారు.



ఛీ..మద్యం వద్దు!



నిరసనకు ర్యాలీగా బయల్దేరిన వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు



నకిలీ లిక్కర్ అంటగట్టొద్దు.. అమాయకుల ప్రాణాలు తీయొద్దు!

భావప్రకటనా స్వేచ్ఛ ఉందా లేదా..?

శ్రీరంగరాజపురం : అధికార పార్టీ ఎమ్మెల్యే, నాయకుల అరాచకం, దోపిడీపై వైఎస్సార్‌సీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించడం నేరమా..? అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఇటీవల తమపై అనుచిత వాఖ్యలు చేశారని, వాటిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య విలేకరుల సమావేశం నిర్వహించారని తెలిపారు. అది పెద్ద నేరమైనట్టు పోలీసులు కుప్పయ్యని ఆదుపులోకి తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసు స్టేషన్‌కు చేరుకుని తాను మీడియాతో మాట్లాడినా అది నేరమైనట్టు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. భావప్రకటనా స్వేచ్ఛ ఉందా..లేదా..? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. లేక పాకిస్థాన్, ఉత్తర కొరియా వంటి నిరంకుశత్వ దేశాల్లో ఉన్నామో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు, నాయకుడికి ఏమైనా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏకాబరం కూర్చొని ఉంటే కారణం లేకుండా టీడీపీకి చెందిన కొంతమంది రౌడీ మూకలు దాడిచేసి గాయపరచడం బాధాకరమన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

దుప్పట్ల పంపిణీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గంగనపల్లె కూడలిలో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో గురువారం జిల్లా యువజన శాఖ అధికారి బీ.ప్రదీప్‌కుమార్ దుప్పట్లను పంపిణీ చేశారు. యువజన శాఖ ఆధ్వర్యంలో నిరాశ్రయుల దినోత్సవాన్ని త్వరలోనే నిర్వహించున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆదరణలేని వృద్ధులకు ఏదో ఒక రూపంలో చేయూత ఇవ్వడానికి అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆ శాఖ ప్రాంతీయ గణాంక అధికారి బాబురెడ్డి, నిరాశ్రయుల కేంద్రం నిర్వాహకులు జోసెఫ్‌రాజు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌కుమార్

నేటి నుంచి బోధనేతర పనులు బహిష్కరణ



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి బోధనేతర పనులను పూర్తిగా బహిష్కరిస్తామని ఫ్యాప్టో చైర్మన్ మణిగండన్, సెక్రటరీ మునీర్‌అహ్మద్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు గురువారం డీఆర్‌వో మోహన్‌కుమార్, డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధనా సమయం కుంటుపడుతోందన్నారు. టీచర్లకు బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా కూటమి ప్రభుత్వం బోధనేతర పనులు చెప్పడం దారుణమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన పోరుబాటలో బోధనేతరపనులు బహిష్కరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మాత్రమే టీచర్లు పనులు చేపడుతారన్నారు. సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సమీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఫ్యాప్టో సంఘ నాయకులు చెంగల్‌రాయమందడి, మదన్‌మోహన్ రెడ్డి, కిరణ్, జగదీష్, చిరంజీవి పాల్గొన్నారు.

నూతన అయ్యోర్లతో చెడుగుడు!

- గందరగోళంగా పోస్టింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ
- పూర్తి స్థాయిలో ఖాళీలే ప్రదర్శించకుండా ఎస్జీటీలకు కౌన్సెలింగ్
- ప్రభుత్వ ఆర్డర్‌కు అధిక సంఖ్యలో పోస్టులు బ్లాక్ చేసిన వైనం
- కూటమి తీరు పై దుమ్మెత్తిపోస్తున్న నూతన అయ్యోర్లు



డీఎస్సీ పోస్టింగ్‌లకు హాజరైన నూతన టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం నూతన అయ్యోర్లతో చెడుగుడు ఆడుతోంది. డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి అభ్యర్థులకు సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో నూతన అయ్యోర్లు ఉద్యోగాల్లో చేరకముందే నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తీవ్ర ఒత్తిడిని భరించలేక ఇటీవల జిల్లా కేంద్రంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఒక స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగమే వద్దు అంటూ వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా ఉద్యోగాలు సాధించినప్పటికీ చాలా మంది పాల్గొనకపోవడం సైతం విమర్శలకు తావిస్తోంది.

ఖాళీలే ప్రదర్శించకుండా..

కౌన్సెలింగ్ నిర్వహించే సమయంలో ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా ఉన్న పూర్తి ఖాళీలను ప్రదర్శించాల్సి ఉంటుంది. అయితే విద్యాశాఖ అధికారులు అలా చేయకుండా లోలోపలే కుట్రలకు పాల్పడి పలు పోస్టులను బ్లాక్ చేశారు. ఈ కుట్రలను ఉపాధ్యాయ సంఘ నేతలు ప్రశ్నిస్తారని పసిగట్టి సంఘ నాయకులకు కౌన్సెలింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని ప్రకటించారు.జరుగుతున్న అన్యాయాన్ని నూతన టీచర్లు ప్రశ్నించలేక మిన్నకుండిపోయారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కేటగిరీ 1, 2లో దాదాపు 500 పోస్టులను ప్రదర్శించకుండా బ్లాక్ చేశారు. 1:1 ప్రాతిపదికన తిరు, చిత్తూరు జిల్లాల్లో శిక్షణలకు హాజరైన నూతన టీచర్లు ఎంత మంది ఉన్నారో అనే ఖాళీలను ప్రదర్శించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

డీఎస్సీ నోటిఫైడ్ పోస్టులు	ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు
1,478	1,403
కౌన్సెలింగ్‌లో చూపించిన పోస్టులు	బ్లాక్ చేసిన 1,2 కేటగిరీ పోస్టులు
1,394	500కు పైగా

1,394 ఖాళీలు మాత్రమే

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1,394 మందికి 1,394 ఖాళీలు మాత్రమే ప్రదర్శించి కౌన్సెలింగ్ నిర్వహించడం విమర్శలకు తావిచ్చింది. నూతన ఉపాధ్యాయులను మారుమూల ప్రాంతాల్లో నియమించేలా కుట్రలకు పాల్పడడంతో దుమారం చెలరేగింది. కనీసం ఖాళీలను కోరుకునే అవకాశం కల్పించలేదని నూతన అయ్యోర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నూతన టీచర్లందరికీ ఒకేసారి నిర్వహించాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా తిరుపతి జిల్లా కేంద్రంలోని ఒక్కొక్క శిక్షణ కేంద్రంలో ఒక్కొక్కసారి కౌన్సెలింగ్ జరపడడంతో నూతన టీచర్లు పూర్తిగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నది మెగా డీఎస్సీ కాదు మాయా డీఎస్సీ అంటూ ఉద్యోగాలు పొందిన నూతన టీచర్లే వెల్లడించడం కొసమెరుపు.

కౌన్సెలింగ్ గందరగోళం

ఉన్నతవిద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 9న చిత్తూరులోని శిక్షణ కేంద్రాల్లో వెబ్ కౌన్సిలింగ్, తిరుపతిలోని శిక్షణ కేంద్రాల్లో ఎస్జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం నుంచి నిర్వహించకుండా పూటకు ఒక నిర్ణయంతో గందరగోళం సృష్టించారు. మొదట్లో స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, ల్యాంగ్వేజ్ పండిట్ కేడర్లకు మ్యాన్యూవల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే వారందరికీ వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి, ఎస్జీటీలకు మాత్రం మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇలా ఒక్కో నిర్ణయం తీసుకుని నూతన అయ్యోర్లకు చుక్కలు చూపించి గందరగోళానికి తెరలేపారు. చివరికి ఈ నెల 9న రాత్రి 7 గంటల సమయంలో తిరుపతి జిల్లా కేంద్రంలోని శిక్షణా కేంద్రాల్లో మ్యాన్యువల్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు.

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

పుంగనూరు: బీటెక్ విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. పోలీసుల కథనం.. పట్టణంలోని ఎన్ఎస్.పేటకు చెందిన సుబ్రమణ్యంరాజు కుమారుడు సురేంద్రరాజు(22) బీటెక్ చదువుతున్నాడు. ఇలా ఉండగా రాత్రి ఆకస్మాత్తుగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండడాన్ని తల్లిదండ్రులు కనుగొన్నారు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా సురేంద్రరాజు వివిధ రకాల బెట్టింగ్‌లలో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని మనస్తాపనికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

నలుగురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని రెండు లాడ్జీల్లో వ్యభిచారం చేస్తున్న నలుగురు నిందితులను పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. వన్ టౌన్ సీఐ మహేశ్వర కథనం.. నగరంలోని సుందరయ్య వీధిలోనీ లాడ్జీలో పోలీసులు రాత్రి 10 గంటల సమయంలో తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకుడు వెంకటేష్ అతని సహాయకుడు రవి ఇద్ద రూ కలిసి ఇక్కడ వ్యభిచారం నిర్వహి స్తూ చిక్కారు. అక్కడే ఉన్న మిత్రుడు అజీమ్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. అదే వీధిలోని మరో లాడ్జీలో తనిఖీలు చేయగా వ్యభి చారం నిర్వహిస్తున్న మేనేజర్ ఉమాపతి, సహాయకుడు సురేంద్రబాబు, గణేష్‌ను అరెస్టు చేశారు. జడ్జి ఆరుగురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం నిందితులను చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు. పనుల కోసం విజయవాడ, శ్రీకాకుళం, హైదరాబాద్, నెల్లూరు నుంచి వచ్చిన పలువురు మహిళలను వ్యభిచార కోపంలోకి దించి ఈ పని చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మహిళలను వారి సొంత ప్రాంతాలకు తరలించారు.

ఆంక్షల యూరియా!

రబీ సీజన్ అదును దాటిపోతోందని యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. మరోవైపు యూరియాపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. వ్యవసాయశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డు ఉన్న రైతుకు మూడు విడతల్లో ఎకరాకు 3 బస్తాలు మాత్రమే పంపిణీ చేస్తుండడంపై ఆందోళన రేకెత్తిస్తోంది. యూరియాపై ఎప్పుడూ లేని ఆంక్షలు విధిస్తుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయలేమని నిట్టూరుస్తున్నారు.





గుర్తింపు కార్డు ఉంటేనే యూరియా

- ఓ వైపు క్యూలు.. మరోవైపు పడిగాపులు
- రబీలో వరినాట్లకు సిద్ధంగా నారుమడులు
- సకాలంలో యూరియా అందక అగచాట్లు
- అన్నదాతల అవస్థలు ప్రభుత్వానికి పట్టవా?

వరదయ్యపాళెం : యూరియా కోసం రైతుల పాట్లు మొదలయ్యాయి. మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్దకు రైతులు క్యూ కడుతున్నారు. ఇప్పటికే వరదయ్యపాళెం మండలంలో రబీలో వరినాట్ల కోసం పూర్తి స్థాయిలో నారు మడులను సిద్ధం చేసుకున్నారు. వాటికి తక్షణమే యూరియా వేయాల్సి ఉంది. అందు కోసం వారం రోజుల నుంచి అటు కార్యాలయం , ఇటు ప్రైవేటు డీలర్ల వద్దకు పరుగులు పెడుతున్నా యూరియా దొరకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



యూరియా కోసం రైతుల పడిగాపులు

రైతులపై నిబంధనల కత్తి

ప్రభుత్వం యూరియాపై పలు ఆంక్షలు విధిస్తోంది. ఆ దిశగా పొలం ఉన్న రైతుకు యూరియా పంపిణీ కోసం రబీ సీజన్‌లో ప్రభుత్వం ద్వారా ఇచ్చే గుర్తింపు కార్డు తీసుకున్న రైతుకు మాత్రమే యూరియా పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ దిశగా గుర్తింపు కార్డు పొందిన రైతుకు మూడు విడతల్లో ఎకరాకు 3 బస్తాలు మాత్రమే పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అందుకు సంబంధించి రైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్దకు క్యూ కడుతున్నారు. అది కూడా పొలానికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్ నమోదు వివరాలను క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందికి అందజేసిన వారికి రెండు రోజుల తర్వాత కార్డులను జారీ చేస్తున్నారు. తదుపరి యూరియా సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతుండడం గమనార్హం.



రైతులకు ప్రభుత్వం అందిస్తున్న గుర్తింపు కార్డు

సీజన్ దాటిపోతోందని గుబులు

ఇప్పటికే వరదయ్యపాళెం మండలంలో 12 వేల ఎకరాల వరి సాగు కోసం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో రైతులు నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ఆ మేరకు వరి వంగడాలను విత్తడంతో నారు మొలకెత్తింది. అయితే సకాలంలో యూరియా పిచికారి చేస్తే నారు ఏపుగా పెరుగుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా అందకపోవడంతో అదును దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడూ లేని ఆంక్షలు విధించడంతో ఈ ఏడాది వ్యవసాయం సాఫీగా జరుగుతుందా? అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

సత్యవేడు నియోజకవర్గంలో అత్యధికంగా రబీ సీజన్‌కు 12 వేల ఎకరాల్లో వరిసాగు వరదయ్యపాళెం మండలంలోనే సాగవుతుంది. అయితే క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. అటు ఈ–క్రాప్ బుకింగ్, ఇటు యూరియా పంపిణీ ఉన్నా అరకొర సిబ్బందితో సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆ శాఖ అధికారులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో 11 రైతు సేవా కేంద్రాలు ఉండగా అక్కడ విధులు నిర్వహించాల్సిన సిబ్బంది ఆరుగురు మాత్రమే ఉన్నారు. దీంతో ఐదుగురు సిబ్బంది కొరత కారణంగా ఎక్కడికక్కడ పనులు ఆగిపోతున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

నాలుగు రోజులుగా తిరుగుతున్నా



నాకు రెండెకరాల పొలం ఉంది. యూరియా కోసం నాలుగు రోజులుగా తిరుగుతూనే ఉన్నా. గుర్తింపు కార్డు ఉంటేనే యూరియా ఇస్తామంటున్నారు. అందు కోసం వివరాలు సమర్పించా. అయినా అందలేదు. రూ. 270 యూరియా బస్తా కోసం రూ. 500 అదనపు ఖర్చు అవుతోంది.

– సుబ్రమణ్యం, రైతు, నాగనందాపురం

ఇంత దారుణం ఎప్పుడూ లేదు



యూరియా కోసం ఇన్ని ఇబ్బందులు పడడం ఎప్పుడూ లేదు. ఇలా ఉంటే వ్యవసాయం కష్టం . యూరియా కోసం తిరగడానికే సమయం సరిపోతుంది తప్ప సకాలంలో వ్యవసాయ పనులు చేపట్టలేం. రైతులను ఇంతగా ఇబ్బంది పెట్టడం సరికాదు. రైతే దేశానికి వెన్నెముక అంటారు గానీ అది ఆచరణలో సాధ్యం కావడం లేదు.

– ముద్దుకృష్ణా రెడ్డి, రైతు, గూడలవారిపాళెం

గుర్తింపు కార్డుల పంపిణీ మొదలు పెట్టాం



యూరియా పంపిణీ కోసం రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నాం. ఇప్పటికే వివరాలు అందజేస్తున్న రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే యూరియా అందజేస్తాం. మొదటి విడతగా 1200 బస్తాలు తెప్పించాం. మూడు విడతల్లో యూరియా పంపిణీ ప్రక్రియ జరుగుతుంది.

– గౌరి, ఏఓ, వరదయ్యపాళెం మండలం

బాత్రూమ్‌లో జారిపడి..

- విద్యార్థికి తీవ్ర గాయాలు
- బుటకపల్లె పాఠశాలలో ఘటన

చౌడేపల్లె: బాత్‌రూమ్‌లోకి వెళ్లిన మూడో తరగతి విద్యార్థి ప్రదీప్(10) యూరినల్ బేసిన్‌పై ఎక్కడంతో బేసిన్ పగిలి కడుపులో దిగి తీవ్రంగా గాయపడిన ఘటన బుటకపల్లె ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుటకపల్లెకు చెందిన బీ.మల్లికార్జున, గంగాదేవి కుమారుడు ప్రదీప్ అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. మూత్ర విసర్జనకు వెళ్లిన బాలుడు యూరినల్ బేసిన్‌పై ఎక్కడంతో బేసిన్ పగిలి కడుపులోకి గుచ్చుకుపోయింది. పేగులు బయటకొచ్చి అపస్మారస్థితికి చేరాడు. సహచర విద్యార్థులు గుర్తించి కేకలు వేశారు. ఉపాధ్యాయుడు శంకరయ్య, తల్లితండ్రులకు సమాచారమిచ్చి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ మేరకు ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పేగులు బయటకొచ్చిన దృశ్యం

నకిలీ మద్యం కేసు సీబీఐకి అప్పగించండి

పాలసముద్రం : కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ములకలచెరువు నకిలీమద్యం కేసును సీబీఐకి అప్పగించాలని మండల పరిధిలో వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేక రులతో మాట్లాడుతూ తంబళ్లపల్లె టీడీపీ నేతల ఆధ్వర్యంలో తయారు చేసిన నకిలీ మద్యం రాష్ట్ర మంతా సరఫరా అయ్యిందన్నారు. దీని వెనుక సూత్రధారులు ఎవరో తెలిసినా వారిని ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ఏడాదిగా మరణించిన వారి మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకనే ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం నిర్బంధించి వేధించిందన్నారు. ఇప్పుడు సాక్ష్యాలున్న నకిలీ మద్యం తయారీ కేసులో ఎవరినీ అరెస్టు చేయకుండా ఎందుకు కాపాడుతున్నారని నిలదీశారు. నకిలీ మద్యం తయారు చేయడానికి వచ్చిన టీడీపీ బడా నాయకుడిని వదిలేసి కూలీలను బలిస్తారా అని ప్రశ్నించారు.

వ్యక్తిగత విమర్శలను ఖండిస్తున్నాం

మాజీ డిప్యూటీ సీఎం కే.నారాయణ స్వామిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే థామస్‌కు లేదని స్థానిక నేతలు హెచ్చరించారు. ఎమ్మెల్యే థామస్ అల్లిబాబా 40 దొంగలు వలే నియోజకవర్గంలో తమిళనాడు రౌడీలను తీసుకొచ్చి బెదించడం అలవాటు చేసుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఇసుక, మట్టి గ్రావెల్, క్వారీలలో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని మండిపడ్డారు.

అప్రజాస్వామికం,దుర్మార్గం

చిత్తూరు రూరల్(కాణిపాకం): మామిడి రైతులు తమ గోడును శాంతియుతంగా, ప్రజాతంత్ర పద్ధతుల్లో తెలియజేసేందుకు అవకాశం ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. జనార్దన్, సి. మునీశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాలుగు నెలలుగా తోతాపురి మామిడి సరఫరా చేసిన 50 వేల మంది రైతులు బిల్లుల కోసం పడిగాపులు కాస్తున్నారని, వారు తరచు శాంతియుతంగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గం అన్నారు. జూన్ మొదటి వారంలో రెండు జిల్లా జిల్లా కలెక్టర్లు, ఎంఎల్ఎలు, రైతు సంఘం నేతలు, గుజ్జు ఫ్యాక్టరీ యజమానుల సమక్షంలో త్రైపాక్షిక కమిటీ తీసుకొన్న నిర్ణయం మేరకు తోతాపురి మామిడి కిలోకు రూ. 12 అమలు చేయమనే తాము గత నాలుగు నెలలు గా కోరుతున్నామన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ లిఖిత పూర్వక ఉత్తర్వులు ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, చివరకు ఈ జిల్లా వాసి సీఎం చంద్రబాబునాయుడు సైతం పదే, పదే తోతాపురి కేజీకి రూ.12 చెల్లిస్తామంటూ తరచు ప్రకటనలు చేసిన విషయం మరిచారా? అని ప్రశ్నించారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): విధుల్లో ఉన్న ఓ ఏఆర్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మురకంబట్టు ప్రాంతంలో ఏఆర్ కానిస్టేబుల్ రవితేజనాయక్ విధులు నిర్వహిస్తున్నారు. అదేసమయంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ డ్రైవర్ ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ నిత్యబాబు, ఎస్ఐ మల్లికార్జున విచారణ చేపట్టారు.

21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి గురువారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక మంత్రి



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం కర్ణాటక రాష్ట్ర మంత్రి సీహెచ్ మునియప్ప దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. ఏఈఓ రవీంద్రబాబు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు.

నగలు చోరీ

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీ, కుమ్మరపల్లెకు చెందిన మురళీకృష్ణ ఇంట్లో 60 గ్రాముల బంగారు నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు.

కొనసా..గుతున్న స్వచ్ఛీకరణ!



- పెరిగిన 2,43,519 మంది ఓటర్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటరు జాబితా స్వచ్ఛీకరణ సా..గుతోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత కొన్ని నెలలుగా కసరత్తు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలుండేవి. జిల్లాల పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల స్వచ్ఛీకరణ ప్రక్రియను చేపడుతున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన ఈ పరిశీలన ప్రక్రియలో పూతలపట్టు నియోజకవర్గం 46 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, చిత్తూరు నియోజకవర్గం 30 శాతంతో ఆఖరి స్థానంలో ఉంది. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 40 శాతం ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ పరిశీలన నిర్వహించారు. ఈ ప్రక్రియ నిర్వహణలో కొన్ని నియోజకవర్గాల అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

పెరిగిన ఓటర్లు

జిల్లా వ్యాప్తంగా ఓటర్లు పెరిగారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2002లో 13,25,269 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 15,68,788 మంది ఓటర్లున్నారు. గత 25 సంవత్సరాల్లో జిల్లా వ్యాప్తంగా 2,43,519 మంది ఓటర్లు పెరిగారు. 2029లో నిర్వహించే సాధారణ ఎన్నికల సమయానికి జిల్లాలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

బోగస్ ఓట్లకు చెక్ పెట్టేలా..

జిల్లా వ్యాప్తంగా బోగస్ ఓట్లకు చెక్ పెట్టేలా అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బోగస్ ఓటర్ల గుర్తింపునకు పాత, కొత్త జాబితాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 2002 నుంచి ఇప్పటి వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉన్న వారిని మాత్రమే స్థానికంగా గుర్తిస్తూ..మిగిలిన వారిన వలసలుగా భావించి వివరాలు సేకరిస్తున్నారు.



కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశం (ఫైల్)

జిల్లా ఓటర్ల స్వచ్ఛీకరణ సమాచారం

సంవత్సరం	ఓటర్లు
2002	13,25,269
2025	15,68,788
పెరిగిన ఓటర్లు	2,43,519

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	ఓటర్ల సంఖ్య
పుంగనూరు	2,39,149
నగరి	2,02,709
జీడీ నెల్లూరు	2,05,623
చిత్తూరు	2,03,570
పూతలపట్టు	2,21,638
పలమనేరు	2,69,065
కుప్పం	2,27,034
మొత్తం	15,68,788

పకడ్బందీగా ప్రక్రియ



జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటర్ల స్వచ్ఛీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో ప్రక్రియను స్వయంగా పరిశీలన చేస్తున్నాం. ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం ప్రక్రియను నిర్వహిస్తున్నాం. ప్రక్రియ నిర్వహణ పై ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి సిబ్బందికి ఆదేశాలిస్తున్నాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నాం.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

అసలు నిందితులను అరెస్టు చేయాలి

- తిరుపతిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన





దేవళంపేటలో అసలు నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి మంగళం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగలపెట్టిన అసలు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర డిమాండ్ చేశారు. తిరుపతి జీవకోనలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాజకీయ కక్షలతో టీడీపీకి చెందిన సతీష్‌నాయుడు తగల పెట్టించారని ఆరోపించారు. గతంలో అక్కడ స్థానిక సర్పంచ్ గోవిందయ్య అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుంటే సతీష్‌నాయుడు అడ్డుకున్నాడని, అయినప్పటికీ అక్కడి దళితులంతా ఒక్కటై ఏర్పాటు చేశారన్నారు. ఆ విషయాలను మనసులో పెట్టుకుని సతీష్‌నాయుడు అంబేడ్కర్ విగ్రహాన్ని తగల పెట్టించాడని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ గోవిందయ్య పైనే తిరిగి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయించడం కూటమి నాయకుల అరాచకాలు, దుర్మార్గాలకు నిదర్శనమన్నారు. పోలీసులు సైతం కూటమి నాయకులకు కొమ్ము కాస్తూ అంబేడ్కర్ విగ్రహ దహనాన్ని చాలా చులకనగా తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అసలైన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ తరఫున పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అజయ్‌కుమార్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బత్తల గీతాయాదవ్, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పార్టీ నాయకులు శ్రీనివాసులు, చేజర్ల మురళి, మద్దాలి శేఖర్, ఆటో ప్రసాద్, కుప్పయ్య, రమణ, శారద, కవితమ్మ, శాంతారెడ్డి, సరస్వతమ్మ, దుర్గ, కుమారమ్మ పాల్గొన్నారు.